అభివృద్ధి పనులు ప్రారంభం



నాచారంలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్ : నాచారం డివిజన్ పరిధిలోని భవానీనగర్‌లో రూ.10 లక్షలు, వీఎస్టీ కాలనీలో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ఏఈ స్రవంతి, వర్క్ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ బీఆర్ఎస్ నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మౌలాలి : డివిజన్‌లో గోకుల్‌నగర్‌లోని పలు సమస్యలు పరిష్కరించాలని మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్‌ను గోకుల్ నగర్ వాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. జగదీష్‌యాదవ్, భరత్, భూషణ్‌యాదవ్, రాజు, దాసు, తిరుపతయ్య, కృపాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలు ఉపయోగకరం



అవుట్‌లెట్‌ను ప్రారంభించిన ఈటల రాజేందర్

ఆల్వాల్: ప్రధానమంత్రి జనఔషధి కేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం నేరేడ్‌మెట్ డివిజన్ మధురానగర్‌లో నూతన అవుట్‌లెట్‌ను ఆయన ప్రారంభించారు. తక్కువ ధరలో నాణ్యతతో ఉన్న మందులు జనఔషధి కేంద్రాల్లో దొరుకుతాయని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కార్పొరేటర్లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, నిర్వాహకుడు గోపు రమణారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

బోడుప్పల్: జాతీయ స్కేటింగ్ క్రీడల్లో కిరణ్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇండియా స్టేట్ క్రీడలు- 2024 ఓపెన్ నేషనల్ స్కేటింగ్ టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొనగా.. తెలంగాణ రూరల్ స్కేటింగ్ అసోసియేషన్ తరుపున కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. సబ్ జూనియర్స్ కేటగిరిలో బాలబాలికలు కాంస్యం సాధించగా.. కెడెట్ కేటగిరిలోనూ కాంస్య పతకం సాధించారని పాఠశాల వ్యవస్థాపకులు రితేష్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేస్తున్నారని వివరించారు.

సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లతో మహిళలు..

రామంతాపూర్ : వనిత జీవన సేవా సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు నిర్వహించిన కుట్టుశిక్షణలో ఉత్తీర్ణులైన మహిళలకు ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు ఆకుల సుభాషిణి మాట్లాడుతూ.. కుట్టు శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన మహిళలందరికీ త్వరలోనే ఉచితంగా కుట్టుమిషన్లు అందజేసేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. త్వరలోనే తమ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఎంబ్రాయిడరీ జర్దోసి తదితర కోర్సుల్లో కూడా శిక్షణ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. సంస్థ సభ్యులు డాక్టర్ ఆకుల సురేష్, బుర్ర మహేందర్, వెంకన్న, సువర్ణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో ఎలాంటి సమస్యలున్నా తన వంతుగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని చిలుకానగర్ డివిజన్ బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం రాఘవేంద్రనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే చొరవతో 243 గజాల స్థలం కేటాయించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా.. త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, కౌశిక్, సోమేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి చర్యలు

మంత్రి సీతక్క ప్రకటనతో మహిళా, శిశు సంక్షేమశాఖ కసరత్తు

- టీచర్, హెల్పర్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు
- గ్రేటర్ సహా శివారు జిల్లాలలో 331 ఖాళీలు
- టీచర్లు, ఆయాల కొరతతో గర్భిణీలు, చిన్నారులకు తప్పని వెతలు



జిల్లా	అంగన్వాడీ కేంద్రాలు	లబ్ధిదారుల సంఖ్య	ఖాళీ పోస్టులు
హైదరాబాద్	914	1,19,800	167
మేడ్చల్	793	95,017	124
రంగారెడ్డి	1600	1,78,797	40
మొత్తం	3,306	3,43,694	331

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా టీచర్, ఆయాల పోస్టులను భర్తీ చేసేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. అంగన్‌వాడీల్లో ఏళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులతో గర్భిణులు, చిన్నారులకు వెతలే మిగులుతున్నాయి. ఖాళీగా ఉన్న టీచర్లు, హెల్పర్స్ (ఆయా) పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని సంబంధిత మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క ఇటీవల చేసిన ప్రకటనతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

- అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్టం చేయటంతో పాటు గర్భిణీలు, చిన్నారుల వెతలు తీర్చుతామని ప్రభుత్వం పేర్కొనటంతో పాటు.. కేంద్రాలకు పంపిణీ చేస్తున్న గుడ్లు ఇతర పౌష్టికాహారంపై సంబంధిత అధికార యంత్రాంగం సీరియస్‌గా వ్యవహరిస్తోంది.

పరిమాణం తగ్గితే వెనక్కే..

తక్కువ పరిమాణం ఉన్న గుడ్లు పంపిణీ చేస్తే వాటిని అధికారులు వెంటనే వెనక్కి పంపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ (ఆయా) పోస్టుల కోసం గతంలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. వాటి పరిశీలన కూడా పూర్తైంది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వం ఆదేశాల కోసం ఎదురు చూస్తోంది.

విధుల నిర్వహణలో వీరే కీలకం..

అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య రక్షణతో పాటు గర్భిణీలు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్యలక్ష్మి పథకం అమలు వంటి విధులు నిర్వహణలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పాత్ర కీలకంగా ఉంటుంది.

1 నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు ..

ఒకటి నుంచి ఆరేళ్లలోపు పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లకు వస్తారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలిసి పిల్లలను ఇళ్ల వద్ద నుంచి తీసుకొస్తారు. పిల్లల చేతులు కడగటం, ఉడికించిన కోడిగుడ్లు ఇవ్వటం, అవి తిన్న తర్వాత వండిన పౌష్టికాహారం పెట్టడం వంటి విధులను వారు నిర్వహిస్తారు. పసిపిల్లలు కావడంతో వారి వ్యక్తిగత శుభ్రత విషయంలో హెల్పర్లు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. కొందరు పిల్లలు రెండుకు వెళ్తే కూడా వారిని కడిగి తుడిచి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. పిల్లలకు చెమటలు పట్టి ఏడుస్తూ దిక్కులు చూస్తున్నప్పుడు వారిని సముదాయించాల్సిన పనులు కూడా హెల్పర్లు నిర్వహిస్తారు.

కేంద్రాల్లో ఖాళీలు ఇలా..

- గ్రేటర్‌తో సహా శివారు జిల్లాలలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టులు ఈ విధంగా ఉన్నాయి. హైదరాబాద్ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో మొత్తం పోస్టులు 167 ఖాళీగా ఉండగా.. టీచర్ పోస్టులు 42, హెల్పర్లు 125గా ఉన్నాయి.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 124 పోస్టులు ఖాళీగా ఉండగా.. ఇందులో 21 టీచర్లు, 103 హెల్పర్ పోస్టులు ఉన్నాయి.
- రంగారెడ్డి జిల్లాలో 40 పోస్టులు ఖాళీగా ఉండగా.. ఇందులో టీచర్ పోస్టులు 8 , హెల్పర్ పోస్టులు 32 ఖాళీలు ఏర్పడ్డాయి.
- గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టుల వివరాలు పై విధంగా ఉన్నాయి.

అంధత్వ నిర్మూలనలో కృషి చేసినందుకు డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న తవుటం ఉమామహేశ్వర్

మేడిపల్లి: అంధత్వాన్ని నిర్మూలించడంలో కృషి చేసినందుకు పీర్జాదిగూడకు చెందిన తవుటం ఉమామహేశ్వర్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. వివరాల ప్రకారం.. ఆటమర్ ఇంటర్నేషనల్ థియలాజికల్ యూనివర్సిటీ (ఏఐటీయు),మనం ఫౌండేషన్ ఆదివారం హైదరాబాద్ సిటీ కల్చరల్ సెంటర్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వేల మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి అంధత్వ నిర్మూలనకు కృషి చేసినందుకు ఈ గౌరవం దక్కిందన్నారు. ప్రతి ఒక్కరూ కనీస బాధ్యతగా గుర్తించి మెరుగైన సమ సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి కల్యాణాన్ని అర్చకులు తులసీరమణాచార్యులు, వేణుగోపాలాచార్యులు ఘనంగా నిర్వహించారు. ప్రతినెలా రెండో ఆదివారం శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన ముగ్గురి రిమాండ్

మల్లాపూర్ : కాంప్లెక్స్ యజమాని, టెనెంట్లను బెదిరించిన ముగ్గురు వ్యక్తులను నాచారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ మల్లాపూర్‌కు చెందిన బొంగోని శ్రీహరిగౌడ్ (39) మల్లాపూర్ వీఎన్ఆర్ కాంప్లెక్స్‌లో గత 13 ఏళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. గత కొద్ది నెలలుగా అద్దె చెల్లించకుండా 'ఈ కాంప్లెక్స్ నాదే అంటూ.. టెనెంట్లు అందరూ నాకే అద్దె చెల్లించాలని, బెదిరింపులకు పాల్పడ్డాడు'. తన స్నేహితులైన కేశబోయిన మహేష్, గుడిసె సురేష్‌లతో కలిసి వీఎన్ఆర్ కాంప్లెక్స్‌లో కరెంట్ ప్యానెల్‌ను ధ్వంసం చేశారు. దీంతో వాచ్‌మెన్, టెన్‌ంట్లను బెదిరించడంతో కాంపెక్లిస్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఎంపీ ఈటల పరామర్శ



రామంతాపూర్ : ప్రమాదవశాత్తు కాలుకు గాయంకావడంతో రామంతాపూర్‌లోని తన గృహంలో విశ్రాంతి తీసుకుంటున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ను ఆదివారం ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గాయం నుంచి కోలుకునే వరకు వైద్యులు సూచించిన జాగ్రత్తలను పాటించాలని ఆయన కోరారు. కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు, బీజేపీ సీనియర్ నేత కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల స్వాధీనం

కుషాయిగూడ: గుట్టుగా తరలిస్తున్న నిషేధిత విదేశీ సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగార్జుననగర్ కాలనీకి చెందిన ఇమ్మడి అశోక్ బైక్‌పై నిషేధిత సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు తరలిస్తున్నట్లు సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు కాపుగాసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి నిషేధిత ఏ-10, బ్లాక్‌బాక్స్, ప్యారిస్ బాక్సులతో పాటు మిరాజ్, అంబర్ పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కుషాయిగూడ పోలీసులకు అప్పగించారు. ఎస్ఓటీ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిలు తెలిపారు.

ఘనంగా తీజ్ వేడుకలు



ఘట్‌కేసర్ : మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో గోర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజార మహిళలు భక్తి శ్రద్ధలతో తీజ్ పర్వదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కౌన్సిలర్ సంగీత హాజరయ్యారు. పెళ్లికాని గిరిజన యువతులు తొమ్మిది రోజులుగా నవధాన్యాలకు నీరు పోసి పెంచిన వెదురు బుట్టను ఎత్తుకుని చేసిన నృత్యాలు అలరించాయి.

నియామకం



ఆల్వాల్: భవననిర్మాణ వాణిజ్య పరిశ్రమ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కాశీ సతీష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు తాండూరు దేవేందర్ సతీష్‌కుమార్‌కు నియామకపత్రం అందజేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు.

ఘనంగా శ్రావణమాస బోనాలు



మల్లాపూర్‌లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి



ఓల్డ్ మల్లాపూర్‌లో బోనాలతో మహిళలు

మల్లాపూర్ : శ్రావణ మాసం బోనాలు మల్లాపూర్‌లో ఘనంగా జరిగాయి, ఆరే పోచమ్మ, జనప్రియ బస్టాప్ వద్ద ఉన్న పోచమ్మ, ఈదమ్మ, పోచమ్మ తల్లికి మహిళలు బోనాలను పెద్ద ఎత్తున సమర్పించారు. అనంతరం తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆల్వాల్: యాప్రాల్ బోనాల జాతరకు ప్రముఖులు హాజరై కట్ట మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి పూజలు చేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ బాబు, ధనలక్ష్మి, వెంకటేష్, పార్వతి, విశాల్ తదితరులు పాల్గొన్నారు.



బోనాల జాతరకు హాజరైన ఈటల రాజేందర్



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మందకృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

మల్లాపూర్ : మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లుగా జరుగుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని పలువురు నేతలు కొనియాడారు. ఆదివారం నాచారంలో గౌడేల్లి రామకృష్ణమాదిగ, నల్లబాబుమాదిగ ఆధ్వర్యంలో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం, మాదిగల ఐక్యత ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టులో ఏడుగురి జడ్జిలతో కూడిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాన్నిస్తూ.. తీర్పును ఇవ్వడంపై దళిత నేతలు సంబరాలు చేసుకున్నారు. ఏర్పుల నాగరాజు, పొన్నాల మహేందర్, హరిబాబు, కొమ్మగల్ల నవీన్, కొరపాక అంజి, శ్రీమూర్తి నాగరాజు, యాకస్వామి, సంతోష్, వేముల మారయ్య, రాంచందర్, నర్సింగ్ రావు, కర్ణ, దేవులపల్లి యాదగిరి, సంజన్న తదితరులు పాల్గొన్నారు.



నాచారం సంబరాల్లో పాల్గొన్న స్థానిక నేతలు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ శోభారాణి

బోడుప్పల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని 26వ డివిజన్ కార్పొరేటర్ ప్రొద్దుటూరు శోభారాణి అన్నారు. కాలనీవాసులతో కలిసి ఆదివారం ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, డివిజన్‌లో నాటిన మొక్కలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రొద్దుటూరు వెంకటేశ్‌గుప్తా, కాలనీవాసులు పాల్గొన్నారు.

సాయి త్రిశక్తి పీఠంలో కుంకుమార్చన



ఉప్పల్ : బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పల్‌లోని శ్రీసాయి త్రిశక్తి ఆలయంలో శ్రీచక్ర లక్ష కుంకుమార్చన వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రిశక్తి పీఠం అధినేత రవీంద్రాచార్యులు హాజరై మాట్లాడారు. శ్రావణమాస ప్రాముఖ్యత గురించి వివరిస్తూ.. ఐక్యత చాలా అవసరమని అది కేవలం మహిళలతోనే సాధ్యమవుతుందన్నారు. హేమంత్ సాయికుమార్ సంక్షేమ వేదిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

మల్కాజిగిరి: ఆల్వాల్‌లోని సత్యసాయి సేవా కేంద్రంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. ఆదివారం విపత్తు పరిస్థితుల్లో ప్రజలను కాపాడే పలు అంశాలపై అవగాహన కల్పించారు. వరదల్లో చిక్కుకున్నప్పుడు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు రక్షించడానికి ఉపయోగించే అంశాలపై శిక్షణ అందజేశామని రాష్ట్ర సేవాదళ్ కో- ఆర్డినేటర్ కృష్ణకుమార్, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా డిస్ట్రిక్ కో- ఆర్డినేటర్ ఆనంద్ తెలిపారు. వాసుదేవరావు, కృష్ణప్రసాద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న భరత నాట్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన శ్రీవారి పాదాలు భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. భరత నాట్యం డాన్స్ అకాడమీ గురువు రమాదేవి శిష్యబృందంచే నిర్వహించిన ప్రదర్శన అలరించింది. పుష్పాంజలి, గజవదాన, కృష్ణ కలియసఖి, జతిస్వరం, కావడి చిందు, అన్నమాచార్య కీర్తనలు, కంజదాళాయతాక్షి స్తోత్రం, ఆనంద నర్తన తదితర అంశాలను కళాకారులు నిత్యశ్రీ, శరణ్యకావ్య శ్రీ, మహేశ్వరి, భార్గవి, కీర్తన, గుంజన్, మంజూల, జ్యోష్న్యలు ప్రదర్శించి మెప్పించారు. –ఉప్పల్

డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల

ఆల్వాల్: లోతుకుంటలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి డాక్టర్ సాయిక్రిష్ణ ఆధ్వర్యంలో జ్ఞానమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యావంతులు, మానవతావాదులు సమసమాజ నిర్మాణంలో కుల నిర్మూలనకు పాటుపడాలన్నారు. సీనియర్ బుద్ధిస్ట్ అనంతరాజ్ ఆయనకు భగవద్గీతను అందజేశారు. జ్ఞానమాల కమిటీ సభ్యులు అనంతరాజ్, మామిడి నారాయణ, శ్రీరాములు,శంకర్, కన్నయ్య, శ్రవణ్‌కుమార్, రాయుడు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన డా.సాయిక్రిష్ణ